# సాక్షి
## వైఎస్‌ఆర్ జిల్లా

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024






### సైబర్ వల.. జనం విలవిల

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి జనం విలవిల లాడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయిస్తున్న ఇలాంటి బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. -8లో



### ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

రాయలసీమ ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో 41 శాతం నిధులను కేటాయించాలని సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.8/26.7

### వాతావరణం

జిల్లాలో అదివారం 26.7 – 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### పండగకు 758 ప్రత్యేక బస్సులు

**కడప కోటిరెడ్డిసర్కిల్:** దసరా పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ పరిధిలో కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాల పరిధిలో 758 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. సాధారణ చార్జీలతోనే బస్సులను నడుపుతామని వారు పేర్కొన్నారు. అక్టోబర్ 4 నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, చెన్నై, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

### గంగమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**లక్కిరెడ్డిపల్లి:** మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.తలనీలాలు అర్పించారు. వర్షాలు కురిపించి అందరూ చల్లగా ఉండేలా కాపాడు తల్లీ అంటూ వేడుకున్నారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేకాధికారి మారుతీ ప్రసాద్‌లు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. పూజారులు చెల్లు వంశీయులు గంగరాజు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

### ఉత్సాహంగా చదరంగం పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ

**కడప ఎడ్యుకేషన్:** కడప నగరం ఆలంఖాన్‌పల్లి సమీపంలోని విజడమ్ హైస్కూల్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చదరంగం టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ పోటీల్లో కడప నగరానికి చెందిన రూపేష్‌రెడ్డి ప్రథమ, ప్రకాశం జిల్లాకు చెందిన ప్రసాద్ ద్వితీయ, మదనపల్లికి చెందిన విక్రమ్‌తేజ్ తృతీయ స్థానం సాధించారు. వీరితోపాటు టాప్ 20లో నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విజ్‌డమ్ స్కూల్ ప్రిన్సిపాల్ మెర్సీ, జిల్లా చదరంగం అసోసియేషన్ కార్యదర్శి అనిల్ దర్బారీ, కోచ్ తబుసమ్, చీఫ్ అర్బిటర్స్ గోపీనాథ్, రామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశలన్నీ రబీపైనే



- జిల్లాలో రబీ సాగుకు ప్రణాళిక సిద్ధం
- ఈ ఏడాది 1,42,812 హెక్టార్లలో సాగు కానున్న పంటలు
- నాలుగైదు రోజుల్లో జిల్లాకు రానున్న విత్తనాలు
- 77,100 మెట్రిక్ టన్నుల ఎరువుల కోసం ప్రణాళిక
- నేటితో ముగియనున్న ఖరీఫ్ సీజన్



పంటల సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న

**కడప అగ్రికల్చర్ :** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు మురిపించాయి. దీంతో ఎన్నో ఆశలతో రైతులు పంటలు సాగు చేశారు. తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండిపోయాయి. పెట్టుబడి కూడా రాక నష్టాలు చవి చూడాల్సి వచ్చింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో పంటల సాగు వందశాతం కూడా కాలేదు. ఖరీఫ్‌నకు సంబంధించి 75,189 హెక్టార్లలో సాధారణ సాగు కావాల్సి ఉండగా.. 59,581 హెక్టార్లలో సాగైంది. సోమవారం ఖరీఫ్ సీజన్ ముగియనుంది. ఇక రైతన్నల ఆశలన్నీ రబీ సీజన్‌పైనే ఉన్నాయి. అక్టోబర్ మొదటివారం నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుంది. దీంతోపాటు బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజుల క్రితం వర్షాలు కురిశాయి. దీంతో అన్నదాతల్లో ఆశలు మొలకెత్తాయి.

- రబీ సీజన్‌కు 1,42,812 హెక్టార్లలో సాధారణ పంటల సాగుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. మరో నాలుగైదు రోజుల్లో విత్తనాలు కూడా రానున్నాయి. ప్రభుత్వం ధర కేటాయించగానే విత్తనాలు సరఫరా చేయనున్నారు. ఏ మండలానికి ఎన్ని విత్తనాలు అవసరం ఉన్నాయి.. అనే అంశంపై ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.
- మరో పది రోజుల్లో ఎరువులు జిల్లాకు రానున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో అన్ని పంటల కంటే అత్యధికంగా 82261 హెక్టార్లలో శనగ సాగు అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు కోసం 72,386 క్వింటాళ్ల శనగలు పంపాలని ప్రణాళిక పంపారు. అలాగే 3104 క్వింటాళ్లు వేరుశనగ, మినుములు, పెసలు కూడా అవసరం ఉందని ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ విత్తనాలు జిల్లాకు రాగానే ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు తరలించి రిజిస్ట్రేషన్లను ప్రారంభించి రైతులకు పంపిణీ చేయనున్నారు.

**ఎరువుల కోసం ప్రతిపాదనలు**

రబీ సీజన్‌లో 77,100 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలో ఎరువులు జిల్లాకు రానున్నాయి. వచ్చిన వెంటనే ఆయా గ్రామాల పరిధిలో పంటల సాగును బట్టి.. అవసరమైన మేరకు రైతు సేవా కేంద్రాలకు తరలించనున్నారు.

జిల్లాలో రబీలో సాగు కానున్న పంటల వివరాలు (హెక్టార్లలో)

| పంట | సాధారణ సాగు |
|---|---|
| వరి | 11,278 |
| జొన్న | 7,917 |
| సజ్జలు | 2,194 |
| మొక్కజొన్న | 1,440 |
| వేరుశనగ | 6,263 |
| పొద్దుతిరుగుడు | 3,244 |
| శనగపంట | 82,261 |
| మినుము | 14,731 |
| పెసలు | 3,182 |
| నువ్వులు | 5,070 |
| పత్తి | 2,626 |
| కొర్ర | 563 |
| ఉలవలు | 428 |
| కంది | 202 |
| ఇతర పంటలు | 1450 |

నెలల వారీగా అవసరం ఉన్న ఎరువుల వివరాలు (మెట్రిక్ టన్నుల్లో..)

| నెల | యూరియ | డీఏపీ | ఎంఓపీ | కాంప్లెక్స్ | ఎస్ఎస్‌పీ |
|---|---|---|---|---|---|
| అక్టోబర్ | 6,379.72 | 1,942.25 | 1,237.11 | 14,663.28 | 494.88 |
| నవంబర్ | 3,479.19 | 462.48 | 424.15 | 4,465.05 | 269.34 |
| డిసెంబర్ | 2,539.29 | 149.31 | 307.32 | 3,300.77 | 400.36 |
| జనవరి | 5,252.92 | 908.87 | 469.23 | 4,609.01 | 893.74 |
| ఫిబ్రవరి | 5,904.86 | 922.28 | 99.07 | 4,324.52 | 296.43 |
| మార్చి | 6,683.55 | 847.41 | 324.41 | 4,784.19 | 274.00 |



జిల్లాకు విత్తనాల కేటాయింపు ఇలా...

| విత్తనాలు | క్వింటాళ్లు |
|---|---|
| శనగలు | 72,386 |
| వేరుశనగ | 1,800 |
| మినుములు | 976 |
| పెసలు | 328 |
| కందులు | 1550 |
| నువ్వులు | 70 |
| కొర్రలు | 18 |
| రాగులు | 4 |

**అన్నీ సిద్ధం చేస్తున్నాం**



రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తున్నాం. మరో నాలుగైదు రోజుల్లో విత్తనాలు, మరో పది రోజుల్లో ఎరువులు జిల్లాకు రానున్నాయి. విత్తనాలు రాగానే గ్రామాల వారీగా రైతు సేవా కేంద్రాలకు తరలించి రిజిస్ట్రేషన్స్ ప్రారంభించి పంపిణీ చేస్తాం.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

### సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలి

ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి



మాట్లాడుతున్న ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి

**ప్రొద్దుటూరు కల్చరల్:** ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుకు అవసరమైన వివిధ అనుమతులను సింగిల్ విండో విధానంలో అమలు చేయాలని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి కోరారు. స్థానిక రవీంద్రా హైస్కూల్‌లో ఆదివారం కడప, అన్నమయ్య జిల్లాల ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం కార్యనిర్వాహక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనానికి ఎన్‌ఓసీ, ఫైర్ వంటి అన్ని అనుమతులను ఒకేసారి ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల గుర్తింపును 8 ఏళ్లకు బదులు 10 ఏళ్లకు పెంచాలని, వాహనాల ఇన్సూరెన్స్ ప్రీమియంను తగ్గించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ట్రిపుల్ ఐటీ ఎంపికలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల పట్ల వివక్ష చూపడం తగదని, విద్యా రంగానికి సంబంధించి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రైవేటు విద్యాసంస్థల సంఘాలతో చర్చించాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని త్వరగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్బారెడ్డి, పట్టణాధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి రాజారాం, మదనపల్లె పట్టణాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీకి హిందువులను దూరం చేయాలనే కుట్ర

- ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల ప్లాన్ సఫలం కాలేదు
- తిరుమలను రాజకీయాల్లోకి తేవడం దారుణం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

**కడప కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి హిందువులను దూరం చేయాలని సీఎం చంద్రబాబు, ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలు కుట్ర చేశాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నూనె వాడారని ఆరోపణలు చేసి, ప్రజల్లో అనుమానాలు రేకెత్తించారన్నారు. వారి నీచ రాజకీయాల్లోకి తిరుమలను తీసుకురావడం దారుణమన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహించడం వల్ల ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాల ప్లాన్ సఫలం కాలేదన్నారు. 110 రోజుల టీడీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. టీడీపీ అసమర్థపాలన నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు జత్వానీ కేసును తెరపైకి తెచ్చారని, కల్తీ నెయ్యి అంటూ దేవదేవునికే మహాపచారం చేశారన్నారు. 2024 మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, అప్పటి నుంచి ఉన్నది ఆపద్ధర్మ ప్రభుత్వమేనన్నారు. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పాలన నడిచిందన్నారు. జూన్‌లో నెయ్యికి టెండర్లు ఆహ్వానించారని, జూలైలో వారు నెయ్యి సరఫరా చేశారన్నారు. అందులో ఆరు ట్యాంకర్లు పరీక్షల్లో పాస్ కాగా, నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపారన్నారు. టీటీడీకి స్వతంత్ర వ్యవస్థ ఉందని, ప్రత్యేక ల్యాబ్ కూడా ఉందన్నారు. టీటీడీ కొనుగోలు చేసే ఆహార పదార్థాలు, ధాన్యాలు, నెయ్యి ఇతరత్రా వాటి నాణ్యతను పరీక్షించిన తర్వాతే లోపలికి అనుమతిస్తారన్నారు. సాధారణంగా నెయ్యి శాంపిల్స్‌ను మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ(సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు పంపిస్తారన్నారు. కానీ ఎన్‌డీడీబీ చైర్మన్ మనీష్ షా, మాజీ చైర్మన్ వర్షా జోషిలు టీటీడీ ఈవోతో సమావేశమైన తర్వాత శాంపిల్స్ మైసూరుకు కాకుండా గుజరాత్‌కు పంపించారన్నారు. ఇందులోనే గూడుపుఠానీ దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ముందుగా మాట్లాడుకున్న ప్రకారం.. నెయ్యిలో వనస్పతి కలిసిందని వారు రిపోర్టు ఇచ్చారన్నారు. రహస్యమైన ల్యాబ్ రిపోర్టును తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విడుదల చేశారన్నారు. టీటీడీ ఈఓ, సీఎం చంద్రబాబు ఇచ్చిన ప్రకటనలకు పొంతన లేదన్నారు. చంద్రబాబు పాలనలో నెయ్యి ట్యాంకర్లను 14 సార్లు వెనక్కి పంపితే, వైఎస్ జగన్ ప్రభుత్వంలో 18 సార్లు పంపారన్నారు. తినే ఆహారంలో జంతు కొవ్వు కలిపితే రెండు రోజులకే దుర్వాసన వస్తుందనే విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వాస్తవాలు ప్రజలు గమనించే సరికి ఏం చేయాలో తోచక.. వైఎస్ జగన్ తిరుమల దైవదర్శనానికి వెళ్తుంటే డిక్లరేషన్ ఇవ్వాలని కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ వారిని ఇతర రాష్ట్రాల నుంచి తరలించి వైఎస్ జగన్‌ను అవమానించాలని చూశారని, మరోవైపు వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు పోలీసులు నోటీసులిచ్చి నిర్బంధం చేశారన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై సిట్ దర్యాప్తునకు ఆదేశించడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐతో గానీ, సిట్టింగ్ జడ్జితో గానీ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. దేవుడు, ప్రజలు ఈ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్ కుమార్, జి.శ్రీనివాసులరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### త్వరలో బ్రౌన్ నూతన భవన నిర్మాణం

- కలెక్టర్ శివశంకర్ లోతేటి

**కడప కల్చరల్:** పది రోజుల్లో సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు మొదలు పెడుతామని, వచ్చే ఆగస్టు 29 (తెలుగుభాషా దినోత్సవం రోజు)న భవనం ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. ఆయన ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నో ఏళ్లుగా బ్రౌన్ నివసించిన స్థలంలోనే ఉన్న ఈ భవనాన్ని, గ్రంథాలయాన్ని సందర్శించాలనుకున్నానని, అది నేటికి నెరవేరిందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రంథాలయం గురించి సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకురాలు డాక్టర్ వి.పార్వతి, గ్రంథాలయ పాలక మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, రీసెర్చి అసిస్టెంట్లు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి వివరించారు. గ్రాండ్ ఫ్లోర్‌లోని అన్ని విభాగాలు, మొదటి అంతస్తులోని సభా ప్రాంగణం, రెండవ అంతస్తులోని పత్రికల నకళ్లు, తాళపత్ర గ్రంథాల విభాగం, రాత పరికరాలు, అందులోని అపురూపమైన గ్రంథాల గురించి కలెక్టర్‌కు తెలిపారు. గ్రంథాలయం వెనుక నూతన భవన నిర్మాణాల కోసం ఉద్దేశించిన స్థలం, సంబంధిత పత్రాలను ఆయన పరిశీలించారు. బ్రౌన్ గ్రంథాలయాన్ని అన్ని వసతులతో గొప్ప గ్రంథాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.

**పర్యాటకాభివృద్ధికి గంగాధర్ కృషి ప్రశంసనీయం**



బాలగొండ గంగాధర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

జిల్లా పర్యాటకరంగ అభివృద్ధికి బాలగొండ గంగాధర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కొనియాడారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని గంగాధర్‌కు రాష్ట్ర ప్రభుత్వ పర్యాటకశాఖ రాష్ట్ర స్థాయిలో ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేసిన సందర్భంగా ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఇంటాక్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య ఉమ్మడి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, చీఫ్ ప్యాట్రన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ కోశాధికారి గంగాధర్ రాష్ట్ర స్థాయి అవార్డు సాధించడం తమకు గర్వకారణమన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప,అన్నమయ్య అధ్యక్షులు ఎ.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పర్యాటక రచనలు చేయడంతో అవార్డు లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి, వైవీయూ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి, కోటా మృత్యుంజయరావు, జానమద్ది విజయభాస్కర్, యల్లేశ్వరరావు, గొబ్బూరి కోటేశ్వరరావు, నాగవేణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి అనారోగ్యం

- సమస్యల వలయంలో రిమ్స్
- కొన్ని వార్డుల్లో పెచ్చులూడుతున్న పై కప్పులు
- సమయం పాటించని వైద్యులు, సిబ్బంది
- రోగులు, సహాయకులకు అవస్థలు



రిమ్స్ ఐపీ గైనకాలజీ విభాగం ముందు నేలపై సేదతీరుతున్న రోగుల సహాయకులు

**కడప అర్బన్:** రిమ్స్‌కు అనారోగ్యం చేసింది. సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కడపకు విచ్చేస్తున్నారు. ఆయన కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల(రిమ్స్), ప్రభుత్వ దంత వైద్య కళాశాలల్లో వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆయన సమస్యలు పరిశీలించి, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**రాత్రి వేళలో నీళ్ల రాక ఇక్కట్లు**

కడప రిమ్స్‌లో ఓపి విభాగంలో వివిధ విభాగాలలో పని చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిలో కొందరు సమయం పాటించడం లేదు. కొందరు హెచ్ఓడీలు.. హౌస్ సర్జన్‌లు, పీజీ వైద్య విద్యార్థులకే పేషెంట్ల బాగోగులను చూడాలని వదిలేసి వెళుతున్న సందర్భాలు ఎక్కువే.

- కొన్ని వార్డులలో మహిళలు, పురుషులు టాయిలెట్స్‌కు వెళ్లాలంటే అంతంత మాత్రమే సౌకర్యంగా వుంటున్నాయి. రాత్రి వేళల్లో నీళ్ల రాక బక్కెట్లలో పట్టుకుంటూ వైద్య సిబ్బంది, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఐపీ విభాగంలో ఎంఐసీయూ, ఐసీయూ వార్డులలో కొన్ని చోట్ల సెంట్రల్ ఐసీయూ విభాగాలు పని చేయక రోగులు ఫ్యాన్‌లు పెట్టుకోవాల్సి వస్తోంది.
- ఐపీ విభాగంలోని రెండో అంతస్తులో సర్జికల్ ఐసీయూ విభాగంలోని వార్డులో సీలింగ్ (పీఓపీ) సెంట్రల్ ఏసీకి బిగించి వుంటారు. నాలుగు రోజుల క్రితం వర్షం పడటంతో సదరు పీఓపీ కొన్ని చోట్ల అలాగే కూలిపోయింది. ఆ సమయంలో రోగులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మూడవ అంతస్తులో నుంచి వర్షపు నీళ్లు కింది విభాగంలోని వార్డులోకి కారుతున్నాయి. ఇలానే నిర్లక్ష్యంగా వుంటే పై పెచ్చులు కూడా ఊడిపోయే ప్రమాదం లేకపోలేదు. సంఘటన జరిగిన రోజున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కూడా సంభవించింది. ఆ సమయంలో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకుండా వెంటనే రాత్రికి రాత్రే రోగులను వేరే వార్డుకు మార్చారు.
- ఐపీ, ఓపీ విభాగాల్లో రోగులకు సంబంధించిన సహాయకులు నేలపైనే సేదతీరుతుంటారు. ప్రధానంగా గైనకాలజీ (కాన్పుల విభాగం) వద్ద రోగుల కోసం వచ్చిన సహాయకులు సేద తీరుతూ ఇబ్బంది పడుతున్నారు.

**ఓపీ సేవలకే పరిమితమైన సూపర్ స్పెషాలిటీ**

- సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఓపీ సేవలు మాత్రమే అందుబాటులో వున్నాయి. సెంట్రల్ ల్యాబ్ విభాగాన్ని ప్రారంభించడంతోపాటు ఐపీ సేవలను కూడా అందుబాటులోకి తీసుకుని రావాల్సి ఉంది. కేన్సర్, మానసిక విభాగాల ఆసుపత్రులలో వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు అంతంత మాత్రమే జరిగాయి.
- మానసిక, సూపర్ స్పెషాలిటీ, కేన్సర్ విభాగాల్లో గతంలో వెలువడిన నోటిఫికేషన్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో వివిధ కేటగిరిల పోస్టుల నియామకం.. ఎన్నికల కోడ్ రావడంతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా నియామకాలు జరగలేదు.
- ఈ సమస్యలను అధిగమించేలా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తగిన చర్యలు తీసుకుని, న్యాయం చేస్తారని ప్రజలు కోరుతున్నారు.

**నేడు ఆరోగ్య శాఖ మంత్రి రాక**

కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సోమవారం ఉదయం 10:30 గంటలకు విచ్చేయనున్నారు. మొదట ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఎమర్జెన్సీ క్లినిక్, ల్యాబ్ విభాగం, మినీ ఆడిటోరియం ప్రారంభిస్తారు. తరువాత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పర్యటన, రిమ్స్ ఐపీ విభాగం లెక్చర్‌గ్యాలరీలో వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తారు.

**ఉద్యోగుల విన్నపాలు**

- రిమ్స్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలు పెంచాలని, రెగ్యులర్ చేయాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.
- ఇటీవల అమలు చేసిన జీఓ 115ను రద్దు చేసి 2012 నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని స్టాఫ్ నర్సులు కోరుతున్నారు.
- శానిటేషన్, కాంట్రాక్ట్ విభాగాలలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలు పెంచాలని, రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**తీవ్ర దుస్థితిలో ఆడిటోరియం**

కడప రిమ్స్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు అందించారు. ఎంతో ఇష్టంగా రిమ్స్‌లో ఆడిటోరియాన్ని ఆయన హయాం (2008)లోనే ప్రారంభించారు. ఆ భవనం ప్రస్తుతం అలంకార ప్రాయంగా మారింది. కరోనా మహమ్మారి సమయంలో కోట్లాది రూపాయల విలువ చేసే ఫర్నీచర్, కుర్చీలు, ఏసీలు, విద్యుత్ సామగ్రిని కొందరు దుండగులు ధ్వంసం చేసి, అపహరించారు. తరువాత ఆ కేసు దర్యాప్తు ఏమైందో తెలీదు. రిమ్స్ అధికారులు కూడా గాలికి వదిలేసినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్రెషర్స్‌డే, కాలేజీడే, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల వారు ఎన్నో కార్యక్రమాలు, వేడుకలు నిర్వహించుకునే ఆడిటోరియం చివరకు శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావడంబోయి.. అదే ఆవరణలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి 'ఈవెంట్ ఆర్గనైజర్స్'కు అప్పగిస్తున్నారు.

## క్లుప్తంగా

### నాలుగు ఇసుక ట్రాక్టర్‌లు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు

**సిద్దవటం :** మండలంలోని దేగనవాండ్లపల్లె పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్‌లను శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తనకు ఫిర్యాదు రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకొని, వాహనాల డ్రైవర్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### కొండచిలువ కలకలం



రాజుపాళెంలో ప్రధాన రహదారిలో వెళుతున్న కొండచిలువ

**రాజుపాళెం :** రాజుపాళెం గ్రామ శివారులో కొర్రపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న ఓ రైస్‌మిల్ సమీపంలో ఆదివారం రాత్రి కొండ చిలువ కనిపించడంతో వాహనదారులు భయాందోళన చెందారు. రాత్రి 8.30 గంటల సమయంలో ప్రొద్దుటూరు–ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో అడ్డంగా ఉండిపోయింది. దీంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులు, ఆటో డ్రైవర్లు భయంతో వెనక్కి వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత కొండ చిలువ పక్కనే ఉన్న చాపాడు కాలువ గట్టుపై ఉన్న గడ్డి, ముళ్లపొదల్లోకి వెళ్లిపోయింది. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకొని అక్కడ నుంచి వెళ్లిపోయారు.

### ప్రైవేటు ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఇవ్వాలి

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :** రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 3 నుంచి 14 వరకు దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. సెలవు రోజుల్లో వారితో వర్క్ షాప్ పేరుతో పని చేయించుకోవడం దారుణమన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఇవ్వాలన్నారు.

### ఇంటర్ ఆర్‌జేడీపై చర్యలు తీసుకోవాలి

**కడప ఎడ్యుకేషన్ :** ఇంటర్ నాన్‌టీచింగ్, కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీలలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఇంటర్ ఆర్‌జేడీ రవిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యరంగంలో బదిలీలను నిషేధించినప్పటికీ, ఇంటర్ ఆర్‌జేడీ మాత్రం రాయలసీమ జోన్ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ ప్రమోషన్లు, కాంట్రాక్ట్ లెక్చరర్ల బదిలీలకు సంబంధించి లక్షల్లో వసూలు చేశారని ఆరోపించారు. ఈ బదిలీలను రద్దు చేసి నిబంధనల ప్రకారం సీనియర్లకు అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నంద కిషోర్, కుమార్, రమణా రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు

# సైబర్ వల.. జనం విలవిల



### జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న 'సైబర్' నేరాలు

- ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు 1801 సైబర్ నేరాల ఫిర్యాదులు
- జిల్లాలో 2020 నుంచి ఇప్పటివరకు దాదాపు 300 సైబర్ కేసులు
- వివిధ కేటగిరిలలో నేరాలు, లక్షల్లో డబ్బులు పోగొట్టుకుంటున్న బాధితులు

**జిల్లాలో ఎన్‌సీఆర్‌బీ పోర్టల్ ద్వారా 1801 ఫిర్యాదులు అందాయి. జిల్లాలో 2020 నుంచి ఇప్పటివరకు నమోదైన సైబర్ కేసుల వివరాలిలా ఉన్నాయి.**




**కడప అర్బన్ :** జిల్లాలోని వందలాది మంది బాధితులు సైబర్ నేరాల బారిన పడి తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లకు, తరువాత జిల్లా కేంద్రంలోని సైబర్ నేరాల నియంత్రణ విభాగం కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదులను అందజేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఎక్కువవుతున్న నగదు రహిత లావాదేవీలు ప్రజలకు ఇబ్బందులను దూరం చే స్తున్నాయి. మరోవైపు మధ్యతరగతి, సామాన్య ప్రజల డబ్బులను దోచుకోవడానికి సైబర్ నేరగాళ్లు ఎప్పటికపుడు కొత్త పంథాలో ముందుకు వస్తున్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. గుర్తు తెలియని సోషల్ మీడియా ఖాతాల నుంచిగానీ, ఫేక్ అకౌంట్‌ల నుంచి ఆన్‌లైన్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ గేమ్‌ల పేరిట లింక్‌లను పంపిస్తారు. లింక్‌లను ఎప్పటికీ క్లిక్ చేయవద్దని ప్రతి రోజూ సైబర్ నేరాల నియంత్రణ విభాగం పోలీసులు అవగాహన కల్పిస్తున్నా, సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి.

- కొన్నిసార్లు డిజిటల్ లావాదేవీలలో తలెత్తే సమస్యల పరిష్కారం కోసం గూగుల్, యూట్యూబ్‌లలో సెర్చ్ చేసుకుంటూ వాటి పరిష్కార మార్గాలు వెతుక్కుంటున్నారు. ఈ విధానం కొన్ని విషయాలలో మంచిదైతే ఎక్కువమంది యువత, విద్యార్థులు, ఉద్యోగులు సైబర్ నేరగాళ్ల వలలో పడిపోవడానికి ఇది కూడా ఒక కారణమని సైబర్ నేరాల నియంత్రణ పోలీసులు తెలియజేస్తున్నారు. గూగుల్లోనే ఫేక్ యాప్‌లు, ఫేక్ లింక్‌లు అప్‌లోడ్ చేసి మొత్తం డేటాను తస్కరిస్తున్న ఘటనలు జరుగుతున్నాయి.

### జిల్లాలో సైబర్ నేరాలను అధిగమించేలా విభాగం పనితీరు..

జిల్లాలో సైబర్ నేరాలను అధిగమించేలా నాలుగు విభాగాలలో పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు.

- సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) ద్వారా వివిధ రకాల ఫిర్యాదులను నమోదు చేయడం.
- సోషల్ మీడియాలో వచ్చే వివిధ రకాల దుష్ప్రచారాలను అరికట్టే దిశగా కృషి చేయడం.



- సైబర్ ఫ్రాడ్స్ ఆన్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడం.
- ప్రతి వారం జిల్లాలోని విద్యాసంస్థలకు వెళ్లి వివిధ అప్‌డేట్ అంశాలపై ఎప్పటికప్పుడు విద్యార్థులు, సిబ్బందిలో అవేర్‌నెస్ ప్రోగ్రాంలను నిర్వహించి ప్రజలను చైతన్యం చేయడం.

### యువతకు అప్రమత్తత అవసరం..

ప్రతి ఒక్కరికీ తెలియని సమాచారం కోసం గూగుల్ సెర్చ్‌కు వెళ్లి వివిధ లింక్‌లను క్లిక్ చేస్తూ సమాచారం తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అలవాటు. వీటిపైనే సైబర్ నేరగాళ్లు నిఘా పెడుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా యువతను సైబర్ నేరగాళ్లు ఉచ్చులోకి లాగుతున్నారు. అందమైన అమ్మాయిల పేరిట ఫేక్ అకౌంట్‌లను క్రియేట్ చేసి గాలం వేయడం, బ్యాంక్ ఫ్రాడ్ ఓటీపీలు, లింక్‌లు, కస్టమర్ కేర్ పేరిట సైబర్ నేరగాళ్లు మరింత మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో జిల్లాలో పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలలో ఎలాంటి సమస్య తలెత్తినా బ్యాంక్‌కు వెళ్లి సంప్రదించాలే తప్ప, గూగుల్‌లో సెర్చ్ చేయవద్దని హెచ్చరిస్తున్నారు.

### గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఎవరైనా సరే బాధితులు తమ పట్ల సైబర్ నేరం జరిగితే వెంటనే గంటలోపే ఎన్‌సీఆర్‌బీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తేనే ఉపయోగంగా ఉంటుంది. ఈ సమయాన్ని ప్రధానంగా 'గోల్డెన్ అవర్' అంటారు. ప్రజల్లో సైబర్ నేరాల పట్ల చైతన్యం కల్గించేందుకు ప్రతి వారం జిల్లాలోని వివిధ కేటగిరిల విద్యాసంస్థలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం.

**– ఏ.మధుమల్లేశ్వర్ రెడ్డి, సైబర్ ఫ్రాడ్ సెల్ ఇన్స్‌పెక్టర్, కడప**

### నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో ప్రజలు సైబర్‌నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి. ఎన్‌సీఆర్‌బీ పోర్టల్ ద్వారా తమ ఫిర్యాదును రిజిస్టర్ చేసుకోవాలి. మీ సమీప పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే సిబ్బంది ద్వారా ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌కు ఫిర్యాదు చేసేందుకు సహకరిస్తారు. తరువాత జిల్లా కేంద్రంలోని సైబర్ నేరాల నియంత్రణ విభాగం వారికి వినతిపత్రం సమర్పించాలి.

**– జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**

### సురక్షిత డిజిటల్ లావాదేవీలిలా చేసుకోవాలి...

- బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, యూపీఐ పిన్, ఓటీపీ, ఏటీఎం డెబిట్‌కార్డు, క్రెడిట్ కార్డు వివరాలను కూడా పంచుకోకూడదు.
- ఆన్‌లైన్‌లో డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు బార్‌కోడ్‌లు, క్యూఆర్ కోడ్‌ల స్కానింగ్ చేయవద్దు.
- ఫోన్‌కాల్, ఈ – మెయిల్ చేసి మీ కేవైసీ అప్‌డేట్ చేయాలని వివరాలు అడిగినా చెప్పవద్దు. అనుమానం వుంటే బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లి చెక్ చేయండి.
- ఈ–మెయిల్‌లు, ఎస్‌ఎంఎస్‌లలో యూఆర్‌ఎల్, డొమైన్ పేర్లలో స్పెల్లింగ్ లోపాలుంటే జాగ్రత్తగా తనిఖీ చేయండి, ఇవి 'హెచ్‌టీటీపీఎస్'తో ప్రారంభమవుతాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌లనే ఉపయోగించండి.
- ఏదైనా వెబ్‌సైట్, అప్లికేషన్‌లో మీ ఈ–మెయిల్‌ను యూజర్ ఐడీగా నమోదు చేస్తున్నపుడు మీ ఈ–మెయిల్ పాస్‌వర్డ్‌ను 'పాస్ వర్డ్' అని పెట్టుకోవద్దు.
- పొరపాటున మీ ఫోన్‌పే, గూగుల్ పే ఖాతాలలో డబ్బులు వేశామని, వాటిని వెనక్కి పంపండి.. అని మీకు ఎవరైనా కాల్ చేస్తే తిరిగి డబ్బులు పంపకండి.
- గూగుల్ సెర్చ్‌లో కస్టమర్ కేర్ కోసం నెంబర్ కోసం వెతుకుతున్నపుడు నకిలీ వెబ్‌సైట్లు ఉంటాయి. అప్రమత్తంగా ఉండాలి.
- ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ పేరిట బ్లాక్ మెయిల్ చేసి నేరాలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో మిమ్మల్ని ట్రాప్ చేయడానికి మీకు గిఫ్ట్ కూపన్లను కూడా పంపించే అవకాశాలున్నాయి. డేటింగ్ సైట్లు, డేటింగ్ యాప్స్ జాగ్రత్తగా ఉండాలి.
- జిల్లాలో ఎక్కువగా వివిధ కేటగిరిలలో సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిలో ప్రధానంగా నాలుగు అంశాలకు సంబంధించిన వాటి ద్వారానే బాధితులు ఎక్కువగా నష్టపోతున్నారు.
- హనీట్రాప్, డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్ ఇన్వెస్టిమెంట్స్, జాబ్ ఫ్రాడ్స్‌లాంటి వాటిల్లో చిక్కుకుంటున్నారు.
- హనీట్రాప్‌లో ఇటీవల కడప నగరానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి పడి అశ్లీల దృశ్యాలను చూశారని గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ కాల్, మెసేజ్ ద్వారా బెదిరించి రూ. 6 లక్షల వరకు కాజేశారు.
- డిజిటల్ అరెస్ట్ వ్యవహారంలో తాము పోలీసులమని మీ దగ్గర ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయిన తమ దృష్టికి వచ్చిందని బెదిరించడం, తద్వారా ఓ రిటైర్డ్ ఉద్యోగి బెంబేలెత్తిపోయి రూ. 55 లక్షలను పోగొట్టుకున్నారు. తాము ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, ఇతరత్రా కీలకపత్రాలను తనిఖీ చేయాలనీ వాటిని తమ వాట్సాప్‌కు పంపించమని బెదిరిస్తే, నిజమేనేమోనని వాటిని పంపడం, తద్వారా వారు డబ్బులను ఎంచక్కా కాజేయడం జరిగింది. ఇదే తరహాలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి రూ. 25 లక్షలను కాజేశారు.
- జాబ్‌ఫ్రాడ్స్ విధానంలో కడప, ప్రొద్దుటూరుకు చెందిన యువత దాదాపు 10 నుంచి 20 మంది లింక్‌లను టచ్ చేయడం ద్వారా దాదాపు రూ. 50 లక్షల వరకు పోగొట్టుకుని ఉంటారు.
- ట్రేడింగ్ ఇన్వెస్టిమెంట్ విధానంలో చాలామంది ఉన్నత హోదాలో ఉన్న వారు నష్టపోయారు. వీరిలో డాక్టర్స్, ఎగ్జిక్యూటివ్ హోదాలో ఉన్న ఉద్యోగులు, డబ్బులను పెట్టుబడులుగా పెట్టి నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఈ ఏడాదిలోనే దాదాపు రూ. 10 కోట్ల రూపాయల వరకు పెట్టుబడుల రూపంలో పెట్టి నష్టపోయి ఉంటారని అంచనా. సమాజంలో ఓ హోదాలో వున్న వ్యక్తి సతీమణి ఇన్వెస్టిమెంట్ ట్రేడింగ్ విధానంలో తన భర్తకు తెలియకుండా దాదాపు రూ. 75 లక్షలను పెట్టుబడిగా పెట్టి నష్టపోయారని సమాచారం.
- ఆన్‌లైన్ గేమ్‌ల ద్వారా ఇన్‌స్టాగామ్‌లో వచ్చిన లింక్‌లో 'ఖేల్ కత్తా' అనే గేమ్ ద్వారా ఒంటిమిట్టకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఏకంగా రూ. 55 లక్షలను పోగొట్టుకున్నాడు.
- జిల్లాలో ఇప్పటివరకు సైబర్ నేరాల బారినపడి రూ.35 నుంచి 40కోట్లరూపాయల వరకు పోగొట్టుకున్నట్లు అంచనా జరుగుతోంది.

## మూడు పురాతన పంచలోహ విగ్రహాలు చోరీ



ఆలయంలోని పురాతన పంచలోహ విగ్రహాలు (ఫైల్)

**కొండాపురం :** కొండాపురం మండల పరిధిలోని బెడుదూరు గ్రామంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి పురాతన శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవారి పంచలోహ విగ్రహాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఘటనా స్థలాన్ని కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశవరెడ్డి, కడప క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ టీంలు పరిశీలించారు. ఆలయ నిర్వాహకులు, స్థానికుల వివరాల మేరకు ఆదివారం ఉదయం దేవస్థానానికి వెళ్లగా గుడి తాళం పగలగొట్టి ఉండటంతో ఈ విషయాన్ని పూజారి నక్కలపల్లి సురేష్‌బాబు స్థానిక గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ పురాతన పంచలోహ విగ్రహాల ధర సుమారు రూ.30 నుంచి 50 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోతి దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న వెంకట సుబ్బమ్మ

**పెండ్లిమర్రి:** పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె గ్రామంలో వృద్ధురాలిపై కోతి దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గుమ్మళ్ల వెంకటసుబ్బమ్మ ఇంట్లో ఉండగా ఆదివారం ఉదయం ఒక కోతి ఇంటి లోపలికి వచ్చి ఆమె తలపై దాడి చేసింది. తీవ్రంగా రక్తస్రావం జరిగింది. గ్రామస్తులు ఆమెను హుటాహుటిన కడప రిమ్స్ అసుపత్రికి తరలించారు. వైద్యులు కోతి కాటుకు టీకాలు వేశారు. రక్త స్రావం ఆగకపోవడంతో కుట్లు వేయడం సాధ్యం కాలేదని వైద్యులు తెలిపారు. ఒకటి, రెండు రోజుల తర్వాత కుట్లు వేస్తామని చెప్పారు. ఎగువపల్లె గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.



## స్కూటీని ఢీకొన్న లారీ

యువతి మృతి



సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడిన శ్రావ్య

**దువ్వూరు :** పాత దువ్వూరులోని ఆంజనేయస్వామి బైపాస్ రోడ్డులో ఆదివారం స్కూటీని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో యువతి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మైదుకూరు మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రావ్య(19) మైదుకూరులో డిగ్రీ చదువుతోంది. ఆమె తన పెద్దనాన్న నారాయణరెడ్డితో కలసి స్కూటీపై వెంకుపల్లె గ్రామానికి వచ్చింది. తిరిగి దువ్వూరుకు వెళ్తుండగా నంద్యాల వైపు నుంచి వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో శ్రావ్యకు తీవ్రగాయాలు కాగా, నారాయణరెడ్డికి స్వల్ప గాయాలయ్యాఇయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు.

## ఉర్దూ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి




మాట్లాడుతున్న సయ్యద్ ఇక్బాల్

**కడప ఎడ్యుకేషన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం సాలే నాగయ్య నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో రూట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించి ఖాళీలన్నింటిని భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ మీడియం సబ్జెక్టులు, లాంగ్వేజ్, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. రూట రాష్ట్ర డైరీ వింగ్ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్ సాహెబ్ మాట్లాడారు. రాష్ట్ర నాయకులు మస్తాన్ వలీ, అఫ్జల్ బాషా, ముహమ్మద్ ఇర్షాద్, ముహమ్మద్ అయూబ్, బేపారి ఫక్రుద్దీన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం

**నందలూరు :** విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నందలూరులో జరిగింది. వివరాలు ఇలా.. మండలంలోని పొత్తపి గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ స్థానికంగా ఎలక్ట్రిషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఓ ఇంట్లో ఎలక్ట్రిషన్ పని చేస్తుండగా షాక్‌కు గురై దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పిడుగు పాటుకు రెండు పాడి ఆవులు మృతి

**రామసముద్రం :** రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి పంచాయతీ దిగువబొంపల్లి గ్రామంలో పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దిగువబొంపల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, సుశీలమ్మలు ఇటీవల జీవనోపాధి కోసం రెండు పాడి ఆవులు తీసుకొచ్చారు. వాటిని ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో కట్టేశారు. రాత్రి మూడు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడిగుపడి రెండు ఆవులు మృతి చెందాయి. ఒక్కో ఆవు రూ.70 వేలు విలువ చేస్తుందని బాధితులు విలపించారు. జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ రెడ్డిశేఖర్‌లు రైతు కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ బాధితులకు కొంత ఆర్థిక సహాయం చేశారు.

### కందిరీగల దాడిలో..



భాస్కర (ఫైల్)

**పెద్దమండ్యం :** కందిరీగల దాడిలో ముగ్గురికి గాయాలు కాగా, వీరిలో ఒకరు మృతి చెందారు. మండలంలోని బండ్రేవులో ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... బండ్రేవుకు చెందిన పొట్లపల్లె భాస్కర (42) ఆర్ఎంపీ వైద్యుడుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామానికి సమీపంలో రైతు మల్లికార్జునరెడ్డి పొలం వద్ద భార్యతో కలిసి ఉంటూ పాడి ఆవులను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం మామిడి తోటలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ రాగా భార్య రమణమ్మ (36), బండ్రేవు హరిజనవాడకు చెందిన అలుగింటి కదిరప్ప (60)తో కలిసి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. అయితే ట్రాక్టర్ దున్నుతుండగా అడ్డుగా ఉన్న తాటిపట్టను పక్కకు తీయడంతో కంతిరీగల గుంపు అక్కడే ఉన్న ముగ్గురిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో తంబళ్లపల్లె ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ భాస్కర మృతి చెందాడు. బండ్రేవు బస్టాండు కూడలి వద్ద ఆర్ఎంపీ వైద్యుడుగా ఉంటూ అందరికి తమవంతు సేవలందిస్తున్న అతని మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

## బీజేపీ విస్తరణకు కృషి చేయాలి

మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

**ప్రొద్దుటూరు :** రాష్ట్రంలో బీజేపీని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్ తెలిపారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 57 శాతం ఓట్లు వచ్చాయన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. అయినా మనం పార్టీని విస్తరింపజేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహించాలని కోరారు. కేంద్రంలో, రాష్ట్రంలో మన పార్టీకి ఆదరణ పెరిగిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అర్కటవేముల హరినారాయణ, బీజేపీ నాయకులు భానుప్రకాష్, వంకదారి నరేంద్రరావు, భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బీరం సుబ్బారెడ్డి, రోశన్న, సీపీ జయలక్ష్మి పాల్గొన్నారు.

**మంత్రికి ఘన స్వాగతం**

సమావేశం అనంతరం మంత్రి సత్యకుమార్‌ను పట్టణంలో గుర్రపు బండిపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. ర్యాలీలో మంత్రి వెంట ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పాల్గొన్నారు.

### ప్రొద్దుటూరు పేరు చెబితేనే భావోద్వేగం వస్తుంది

ప్రొద్దుటూరు పేరు చెబితే తనలో భావోద్వేగం వ్యక్తమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్ అన్నారు. స్థానిక రాయల్ కౌంటీ రిసార్ట్‌లో మంత్రికి పౌర సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను పుట్టిన పెరిగిన ప్రొద్దుటూరుతో 50 ఏళ్లుగా అనుబంధం ఉందన్నారు. తన తండ్రి ఒక లారీ డ్రైవర్‌గా ఉండేవాడని, తాను అనంతపురం జిల్లా గడేకల్లులో జన్మించినా ప్రొద్దుటూరులోనే తన విద్యాభ్యాసం కొనసాగిందన్నారు. కేవలం సిద్ధాంతాన్ని నమ్మడంతో బీజేపీ తనను ఈ స్థాయికి ఎదిగేలా చేసిందన్నారు. తనను ఎన్నుకున్న ధర్మవరం నియోజకవర్గంతోపాటు తాను పెరిగిన ప్రొద్దుటూరుకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు, పార్టీల నాయకులు మంత్రిని సన్మానించారు.

## సీమ ప్రాజెక్టులకు 41 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

**ప్రొద్దుటూరు క్రైం :** రాష్ట్రంలో 41 శాతం భూభాగం ఉన్న రాయలసీమ ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో 41 శాతం నిధులను కేటాయించాలని సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలోని స్త్రీ శక్తి భవన్‌లో ఆదివారం రాయలసీమ విద్యావంతుల వేదిక 4వ రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన దశరథరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమకు సాగునీరు, తాగు నీరు అందించాలన్నారు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు గడిచినా రాయలసీమకు ఇచ్చిన హామీలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. ముఖ్యంగా సీమలోని పంట పొలాలకు సాగునీరు దక్కేలా సిద్దేశ్వరం అలుగును నిర్మించాలని గత ఎనిమిదేళ్లుగా ఇక్కడి రైతులు, ప్రజాసంఘాలు ఉద్యమిస్తూనే ఉన్నాయని తెలిపారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం నీటి కేటాయింపులు జరిగితే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని తద్వారా పరిశ్రమలు వస్తాయన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా, వెలిగొండ సాగు నీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, విద్యావంతుల వేదిక కో కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్వీ మహమూద్, ఎ.రత్నం ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ద్విచక్రవాహనదారుడు

**గాలివీడు :** విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దేరంగుల పాలకొండ్రాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వీరబల్లి మండలం మట్లి గ్రామానికి చెందిన పాలకొండ్రాయుడు ఆదివారం ద్విచక్ర వాహనంపై గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కరిమిరెడ్డిగారి పల్లె వద్దకు రాగానే సబ్ స్టేషన్ దగ్గర బైక్ అదుపుతప్పి ఎదురుగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయమైంది. గాయపడిన వ్యక్తి జేబులో ఉన్న ఓటరు కార్డు ఆధారంగా వివరాలు గుర్తించి వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు సమాచారం.